

అల్లూరి సీతారామరాజు 127వ జయంతిని గురువారం జిల్లా అంతటా ఘనంగా నిర్వహించారు. అల్లవరం మండలం కోడూరుపాడులో అల్లూరి విగ్రహానికి ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పూలమాల వేసి నివాళులర్పించారు...8లో





తెలంగాణ వాడిని... చదువంతా విజయవాడలోనే




- ఉమ్మడి తూర్పు గోదావరిలో పనిచేసిన అనుభవం
- గోదావరి వరదలను సమర్థవంతంగా ఎదుర్కొందాం
- ఇసుక, మట్టి అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు
- ప్రాధాన్యతాక్రమంలో సమస్యలను పరిష్కరిస్తా

కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్

అమలాపురం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రానికి చెందిన వ్యక్తిని... అయినప్పటికీ విద్యాభ్యాసమంతా విజయవాడలోనే సాగింది... ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పనిచేసిన అనుభవం ఉంది... కోనసీమను ప్రగతి పథం వైపు ఎలా నడిపించగలమో అనే అంశంపై ప్రధానంగా దృష్టి సారిస్తా... జిల్లాలోని భౌగోళిక పరిస్థితులు, వనరులు, అభివృద్ధి అంశాలపై రెండు రోజుల్లో అధికార యంత్రాంగం ద్వారా అధ్యయనం చేసి జిల్లాను అన్ని రంగాల్లో పురోగమింపచేసేలా చర్యలు తీసుకుంటాను' అన్నారు కోనసీమ జిల్లా రెండో కలెక్టర్‌గా నియమితులైన రావిరాల మహేష్‌కుమార్. గురువారం బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పనిచేసిన తాను తొలిసారిగా కోనసీమ జిల్లా కలెక్టర్‌గా వచ్చానన్నారు. పంట కాల్వలు, డ్రైనేజీల్లో పూడికతీత తీయించని పక్షంలో రైతులు క్రాప్ హాలిడేకు వెళ్లే అవకాశం ఉంది. గోదావరి వరదలకు ముందుగానే ఏటిగట్లను బలోపేతం చేయాలని, ఇసుక, మట్టి అక్రమ రవాణాలను పూర్తిగా అరికట్టాలని, ఆక్వాకల్చర్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి అక్రమ చెరువులకు అడ్డుకట్ట వేయాలని పాత్రికేయులు సూచించగా ప్రాధాన్యతాక్రమంలో ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకు కలెక్టర్ మహేష్‌కుమార్ ఇలా బదులిచ్చారు.

- రాష్ట్రంలోనే అత్యంత ఉత్పాదక శక్తిగల సారవంతమైన ప్రాంతం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా.
- సారవంతమైన భూములు కలిగి సాగునీటి వనరులు కలిగిన ప్రాంతం కోనసీమ. ఈప్రాంతం వ్యవసాయ, ఉద్యానపరంగా మరింత అభివృద్ధి సాధించే దిశగా పబ్లిక్, ప్రైవేటు సెక్టార్ల ద్వారా కృషి చేస్తాను.
- ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలుచేసి చిట్టచివరి లబ్ధిదారునికి కూడా లబ్ధి అందేలా చూస్తాను.
- గతంలో రాజమహేంద్రవరం సబ్ కలెక్టరుగా, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనరుగా, విజయనగరం జాయింట్ కలెక్టరుగా, రాష్ట్ర సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ ఇనిస్టిట్యూట్ సొసైటీ కార్యదర్శిగా విధులు నిర్వర్తించాను.
- ప్రతిఏటా సంభవించే గోదావరి వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనే దిశగా పటిష్ఠమైన చర్యలు చేపట్టి ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవించకుండా భద్రతాపరంగా చర్యలు తీసుకుంటాను.
- రబీ సీజన్లో కొనుగోలు చేసిన ధాన్యానికి బకాయిలు త్వరలో చెల్లించేందుకు రాష్ట్ర పౌర సరఫరాల అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నాము.



బాధ్యతల స్వీకారం...

జిల్లా రెండో కలెక్టర్‌గా నియమితులైన రావిరాల మహేష్‌కుమార్ గురువారం ఉదయం కలెక్టరేట్‌లోని చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆయన్ను జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, అమలాపురం ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి మర్యాద పూర్వకంగా కలుసుకుని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సమాచార, పౌరసంబంధాల అధికారి కె.లక్ష్మీనారాయణ, కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మర్యాద పూర్వకంగా...

అమలాపురం టౌన్, జూలై 4: కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రావిరాల మహేష్‌కుమార్‌ను ఎస్పీ ఎస్.శ్రీధర్ గురువారం కలెక్టర్ చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలుసుకుని అభినందనలు తెలిపారు.

అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి సన్నిధిలో...



అయినవిల్లి, జూలై 4: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రావిరాల మహేష్‌కుమార్ గురువారం కుటుంబ సమేతంగా అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. తొలుత వారికి దేవదాయ శాఖ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం కలెక్టర్ దంపతులకు వేదాశీర్వచనం అందజేసి శేష వస్త్రంతో సత్కరించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. కలెక్టర్ వెంట కొత్తపేట ఆర్డీవో సత్యనారాయణ, అధికారులు వున్నారు.



కలెక్టర్ హిమాన్షు శుక్లా దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ శ్రీధర్ తదితరులు

హిమాన్షు శుక్లాకు వీడ్కోలు

అమలాపురం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా తొలి కలెక్టర్‌గా చేసి బదిలీ అయిన హిమాన్షు శుక్లాకు కలెక్టరేట్ సిబ్బంది గురువారం ఘనంగా వీడ్కోలు సన్మానోత్సవం నిర్వహించారు. సన్మానగ్రహీత శుక్లా మాట్లాడుతూ జిల్లాలో పనిచేయడం ఎంతో సంతృప్తిని, ఆనందాన్ని ఇచ్చిందన్నారు. కోనసీమ అల్లర్లను సవాల్‌గా తీసుకుని పరిస్థితిని అధిగమించడం మంచి గుణపాఠమన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్ మాట్లాడుతూ శుక్లాతో కలిసి పని చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. బృంద స్ఫూర్తితో జిల్లా యంత్రాంగాన్ని చైతన్యపరుస్తూ పనులు చేయించడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అని ప్రశంసించారు. ఎస్పీ ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజల రక్షణ కోసం శుక్లా తీసుకున్న చర్యలు ప్రశంసనీయమన్నారు. ముందుచూపుతో పని చేస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారని ప్రశంసించారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా సతీమణి కాకినాడ జిల్లా పూర్వపు కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూనూతనంగా ఏర్పడ్డ కోనసీమ జిల్లాకు మొదట్లో మౌలిక సదుపాయాలు లేనప్పటికీ ఎంతో శ్రమించి కాకినాడ జిల్లాకంటే మెరుగైన వసతులను కల్పించడం సంతోషదాయకమన్నారు. ఈ సందర్భంగా హిమాన్షు శుక్లా-కృతికా శుక్లా దంపతులకు జిల్లా అధికారులు దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఆయనతో ఉన్న అనుభవాలను పలువురు పంచుకున్నారు. కలెక్టరేట్ సిబ్బంది ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులతో కలిసి కలెక్టర్ దంపతుల వాహనాన్ని తాళ్లతో లాగి ఘనంగా వీడ్కోలు పలికారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా,రంకిరెడ్డి కాశీవిశ్వనాథ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ శ్రీధర్, కలెక్టర్ మహేష్‌కుమార్



సాయుధ పోరాట యోధుడు 'అల్లూరి'

అమలాపురం టౌన్, జూలై 4: భరతమాత దాస్య శృంఖలాలను తెంచేందుకు సాయుధ పోరాటాన్ని ఎంచుకున్న తెలుగు జాతి ముద్దుబిడ్డ అల్లూరి సీతారామరాజు అని కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ పేర్కొన్నారు. మన్యం వీరుడు అల్లూరి 127వ జయంతి వేడుకలను కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటాన్ని విప్లవపంథావైపు మళ్లించి దేశమంతా పోరాటాగ్నిని రగిలించిన అల్లూరి విప్లవజ్యోతిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, వికాస జిల్లా మేనేజరు గోళ్ల రమేష్, కోనేరు రంగారావు సిఫార్సుల కమిటీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.మదన్‌మోహనరావు, సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రిటీషు పాలకుల అకృత్యాలకు వ్యతిరేకంగా పోరాడిన విప్లవ యోధుడు అల్లూరి సీతారామరాజు అని ఎస్పీ ఎస్.శ్రీధర్ పేర్కొన్నారు. అల్లూరి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించడంతో గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి ఎస్పీ శ్రీధర్‌తో పాటు అదనపు ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా, వివిధ శాఖల అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తొలినాళ్లలో జిల్లాలోని నిరుపేదలకు ఇళ్ల స్థల పట్టాలు ఇచ్చారు. మళ్లీ పదవీకాలం ముగుస్తుందనగా మరోసారి గుర్తుచేస్తూ వాటిని రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. కానీ తమకు కేటాయించిన ఇళ్ల స్థలాలు ఎక్కడ ఉన్నాయో లబ్దిదారులకు నేటికీ తెలియదంటే ఆశ్చర్యమే మరి. ప్రధానంగా అమలాపురం, పి.గన్నవరం నియోజకవర్గాల్లో ఇళ్ల స్థల పట్టాల కోసం సేకరించిన భూముల నుంచి దందా ప్రారంభమైంది. నదీ గర్భంలో కలిసిపోయే భూములను కూడా ఇళ్ల స్థలాల పట్టాల కోసం సేకరించి రెవెన్యూ అధికారులు తమ ఘనతను చాటుకున్నారు. ఇక భూసేకరణలో వైసీపీ నాయకుడు పెద్ద ఎత్తున దోపిడీకి పాల్పడినట్టు బహిరంగంగానే ఆరోపించారు. సేకరించిన భూములను మెరక చేసేందుకు ఒక తట్ట మట్టి కూడా వేయని జగనన్న లే-అవుట్‌లు ఎన్నో ఉన్నాయి. స్వలాభం కోసం దారీతెన్నూ లేకుండా భూసేకరణ జరిపేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇళ్ల స్థల పట్టా భూములను మెరకచేసి అప్పగిస్తారని నిరుపేదలు కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు.

ఇమ్మిడివరప్పాడులో అన్ని సదుపాయాలు ఉన్నా రోడ్డు మార్గం లేని ఇళ్ల స్థల పట్టాల భూమి



దారీతెన్నూ లేదు!

- పట్టాలు ఇచ్చి వదిలేశారు
- ఇళ్ల స్థలాలకు మాత్రం మోక్షం లేదు
- కూటమి ప్రభుత్వంపై నిరుపేదల ఆశలు

అమలాపురం రూరల్, జూలై 4: జిల్లాలో శ్మశానవాటికలు, వరదలొస్తే పొంగి ప్రవహించే మేజర్ డ్రెయిన్లు, గోదావరి తీరంలోను... ఇలా ఎక్కడ పడితే అక్కడ ఇళ్ల స్థల పట్టాలు మంజూరు చేశారు. ఒక్క అమలాపురం రూరల్ మండలంలోనే పేదలకు ఇచ్చిన పట్టా భూముల్లో చిత్రవిచిత్ర పరిస్థితులు నెలకొన్నాయి. మండలంలో జగనన్న కాలనీల కోసం తొలుత 24 లే-అవుట్లు ప్రకటించారు. గత ప్రభుత్వాల హయాంలో ఇచ్చిన ఇళ్ల స్థల భూములు, ప్రభుత్వం సేకరించిన భూములు వెరసి 76.48 ఎకరాల్లో ఇళ్ల స్థలాల లే-అవుట్లు వేశారు. అమలాపురం పట్టణానికి సంబంధించి నిరుపేదల కోసం మండలంలోనే మరికొన్ని లే-అవుట్లు వేసేందుకు భూములు సేకరించారు. వీటిలో సుమారు 80 ఎకరాల వరకు ఇంతవరకు మెరక పనులకు నోచుకోలేదు. మండలానికి సంబంధించి చివరకు 22 లే-అవుట్లను మిగిల్చారు. వాటిలో గతంలోనే మెరక పనులు పూర్తి చేసుకున్నవి, ఆ తర్వాత మెరక పనులు చేసిన 24.68 ఎకరాల్లోని 12 లే-అవుట్లను జగనన్న కాలనీలకు సిద్ధం చేసి ఇళ్ల నిర్మాణం చేపట్టారు. మిగిలిన పది లే-అవుట్లకు సంబంధించి 41.80 ఎకరాల భూములను మెరక చేయాల్సి ఉంది. వాటిలో 1,676 మంది లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చారు. నాలుగేళ్ల క్రితం పట్టాలు ఇవ్వగా నిరుపేద కుటుంబాలకు చెందిన వందలాది మంది ఇళ్ల స్థల పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

మెరక పనుల బకాయిలు రూ.23కోట్లు

ఇళ్ల స్థలాలకు సేకరించిన భూములను మెరక చేసేందుకు అవసరమైన మట్టికి కొరతైతే లేదు. కానీ మట్టి తరలింపు నిబంధనలతోనే అసలు సమస్య. దానికి తోడు మట్టి తరలింపులో జరుగుతున్న అక్రమాలు అన్నీఇన్నీ కావు. బండారులంక, వన్నెచింతలపూడి, తాండవపల్లి తదితర గ్రామాల్లో జగనన్న లే-అవుట్లను మెరక చేసేందుకు పట్టా భూములకు పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో మట్టి సరఫరా నెపంతో వందలాది ట్రాక్టర్ల మట్టి దారిమళ్లిపోయింది. అప్పట్లో విపక్షాలు ఆరోపణలు, ఫిర్యాదులు చేసినా పట్టించుకున్న నాథుడే లేడు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఇళ్ల స్థలాల మెరక పనులను తొలుత జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిర్వహించారు. అప్పట్లో జరిగిన మెరక పనులకు కొంతమేర బిల్లులు సైతం చెల్లించారు. ఇంకా రూ.23 కోట్లు బకాయిలు విడుదల కావలసి ఉందని డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ తెలిపారు. ఈ అంశాన్ని గత ప్రభుత్వం దృష్టికి పలు పర్యాయాలు తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింద ని, కానీ ఇంతవరకు నిధులు విడుదల కాలేదన్నారు.

అన్ని సదుపాయాలు ఉన్నా.. రోడ్డు మార్గం లేక...

ఇమ్మిడివరప్పాడులో నిరుపేదలకు ఇచ్చిన ఇళ్ల స్థల పట్టా భూముల్లో వింత పరిస్థితి నెలకొంది. ఆ స్థలాన్ని చూస్తే ఎవరైనా సరే వెంటనే అక్కడ ఇల్లు కట్టుకోవాలని అనుకుంటారు. అందుకే ఇళ్ల స్థల పట్టాలు పొందిన లబ్ధిదారులు ఇప్పటికే 95శాతం మంది శంకుస్థాపన చేసుకున్నా రు. కోట్లు వెచ్చించి ఇళ్ల స్థలాలకు భూమిని కొన్నారు గానీ అక్కడకు వెళ్లి ఇల్లు నిర్మించుకునేందుకు దారి లేదన్న విషయాన్ని మరిచిపోయారు. దారీతెన్నూ లేని అక్కడకు ఎక్కడో 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈదరపల్లి గ్రామానికి చెందిన పేద లబ్ధిదారులకు ఇళ్ల స్థల పట్టాలుగా ఇచ్చారు.

మత్స్య శాఖ చెరువులు పూడ్చారు సరే...

ఈదరపల్లిలో శ్మశానవాటిక చెంతన మత్స్య శాఖ ఆధీనంలో అప్పటివరకు ఉన్న 1.70 ఎకరాల్లో ఉన్న చెరువులను 64 మందికి పట్టాలుగా ఇచ్చారు. వెంటనే మెరక పనులు పూర్తి చేశారు. చకచకా స్టోన్ ప్లాంటేషన్ కూడా చేపట్టారు. ఇక ఇళ్ల నిర్మాణమే తరువాయి అన్న సమయంలో మత్స్యశాఖ ప్రతినిధులు కోర్టును ఆశ్రయించడంతో ఆ భూములు నిరుపయోగంగా మారాయి.

పట్టా భూముల ఊసే లేదు...

బండారులంకలో నిరుపేదల కోసం స్థానిక అప్పర్ కౌశిక మేజర్ డ్రెయిన్ చెంతన పది ఎకరాల భూమిని సేకరించారు. పట్టాలు ఇచ్చిన తొలినాళ్లలో కొంతమేర మెరక పనులు చేశారు. వందలాది మంది ఇళ్లు నిర్మించుకునేందుకు సిద్ధంగా ఉన్నా స్థలాలు చూపించకపోవడంతో స్థానికులు పలు పర్యాయాలు ఆందోళనకు దిగారు. దారీ తెన్నూలేని ముంపు భూములను కొనుగోలు చేయడం పట్ల నేటికీ విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



ఈదరపల్లిలో శ్మశాన వాటిక చెంతన మెరకచేసి ప్లాట్లు విభజన చేసిన ఇళ్ల స్థలాల భూమి



జనుపల్లిలో ఇళ్ల స్థలాల కోసం గుర్తించి పట్టాలు పంపిణీ చేసిన మందబయలు భూమి

జనుపల్లిలో పట్టాలు ఇచ్చారు సరే..

జనుపల్లి పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న మందబయలు భూమిని ఇళ్ల స్థల పట్టాల కోసం సేకరించడంతో పాటు అదే స్థలంలో పట్టాలు సైతం ఇచ్చారు. లోతట్టు ప్రాంతంలో ఉన్న చెరువు భూమి కావడంతో మెరక చేయడం సాధ్యం కాని పనిగా వైసీపీ నాయకులు, అధికారులు ఆలస్యంగా గుర్తించారు. ఇళ్లు కట్టుకునేందుకు స్థలం చూపించమని స్థానికులు ఉన్నతాధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ప్రయోజనం లేకుండా పోయింది. ఇప్పుడు తాండపవల్లి, వన్నెచింతలపూడి లే-అవుట్లలో ఇళ్ల స్థలాలు ఇస్తామని చెబుతూ పుణ్యకాలమంతా గడిపేశారు. నిరుపేదల చేతుల్లో ఉత్తుత్తి పట్టాలు మాత్రమే మిగిలాయి. ఇలా చెప్పుకుంటూ పోతే జగనన్న కాలనీల్లో ఎన్నో లీలలు వెలుగు చూస్తాయి.

దశాబ్దాల కాలంగా మెరక పనులకు నోచుకోక...

ఇందుపల్లిలో ఇళ్ల స్థలాల కోసం నేడు గుర్తించిన భూములు దశాబ్దాల కాలంగా మెరక పనులకు నోచుకోలేదు. తొలుత ఈదరపల్లి గ్రామానికి చెందిన పలువురికి ఈ కాలనీలో ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఆ తర్వాత అమలాపురం పట్టణ డంపింగ్ యార్డుగానూ గుర్తించారు. ఇప్పుడు జగనన్న కాలనీగా మారింది. అయినా ఇంతవరకు ఒక తట్ట మట్టి కూడా వేయలేని పరిస్థితి.



మాజీ ఎంపీ మార్గాని భరత్ ప్రచార రథం దహనం

వైసీపీ కార్యకర్త 'ప్లానింగే'..

- ఎన్నికల్లో ఓడిపోయిన భరత్‌కు సానుభూతి తీసుకొచ్చేందుకు ప్రయత్నం
- పక్కా ప్రణాళికతో ప్రచార రథాన్ని తగలబెట్టిన వైనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ కిశోర్‌కుమార్


విలేకర్లకు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కిశోర్‌కుమార్

రాజమహేంద్రవరం, జూలై 4(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ ప్రచార రథాన్ని వైసీపీ కార్యకర్త.. అదీ భరత్ తండ్రి మార్గాని నాగేశ్వరరావు ముఖ్య అనుచరుడే తగలబెట్టేశాడు. దీనికి ప్రొఫెషనల్ క్రిమి నల్ కంటే తెలివిగా ఆలోచన చేయడం పోలీసులను కూడా ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ మేరకు వివరాలను ఈస్ట్‌జోన్ డీఎస్పీ కిశోర్‌కుమార్ వెల్లడించారు. రాజమహేంద్రవరం వీఎల్ పురానికి చెందిన దంగేటి శివాజీ కొన్నేళ్ల నుంచి వైసీపీ కార్యకర్తే కాకుండా మార్గాని నాగేశ్వరరావుకు ముఖ్య అనుచరుడు. భరత్ కార్యాలయం ఉన్న మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోనే ఎక్కువ సమయం గడిపేవాడు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో భరత్ ఓడి పోవడంతో ఆవేదన చెందాడు. ఎలాగైనా ఏదో ఒకటి చేసి టీడీపీ వాళ్లపైకి నెపం నెట్టేయాలని, భరత్‌పై ప్రజల్లో సానుభూతి వచ్చే విధంగా చేయాలని పథకం వేశాడు. ఈ క్రమంలో గత నెల 28న శివ మరికొంతమంది కలిసి రాత్రి 10 గంటల వరకూ మార్గాని ఎస్టేట్స్‌లోని రచ్చబండ వద్ద మద్యం తాగారు. తర్వాత ఎవరి దారిన వారు వెళ్లిపోయారు. రాత్రి 10.30 గంటల ప్రాంతంలో తన బైక్ నుంచి శివ ఒక ప్లాస్టిక్ కవర్లోకి పెట్రోలు తీశాడు. ఒక దుకాణంలో దోమల చక్రం, అగ్గిపెట్టె కొన్నాడు. దోమల చక్రం చిన్న ముక్క విరిపి దానికి నాలుగు అగ్గిపుల్లలు వెలిగే కొనను ప్లాస్టిక్ తాడుతో కట్టాడు. వీటిని తీసుకొని ప్రచార రథం వద్దకు వెళ్లాడు. ఎదుటవైపు టైరుపై పెట్రోలు ఉన్న కవర్‌ని ఉంచి.. దానిపై అగ్గిపుల్లలు కట్టిన భాగం పెట్టాడు. మరోవైపు దోమల చక్రం ముక్కను వెలిగించి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఇదంతా ఒక నిమిషంలో చేసేశాడు. దోమల చక్రం వెలుగుతూ వచ్చి అగ్గిపుల్లలు మండి ఆపై పెట్రోల్ కవర్‌కి నిప్పు అంటుకొని పెట్రోల్‌తో మంటలు చెలరేగాయి. ఇవన్నీ టైరుపై ఉండడంతో మరింత వేగంగా మంటలు వ్యాపించాయి. దీంతో ప్రచార రథం దగ్ధమైందని డీఎస్పీ వివరించారు. శివాజీకి అతని స్నేహితుడు బాలు ఫోన్ చేసి భరత్ ఆఫీసు వద్దకు పోలీసులు ఎందుకు వచ్చారని ప్రశ్నించాడన్నారు. అయితే ఏమీ తెలియనట్టు విషయం ఆరా తీస్తానని చెప్పి మార్గాని నాగేశ్వరరావుకు శివాజీ ఫోన్ చేశాడన్నారు. ఏమైందో తెలుసుకుంటానని చెప్పిన నాగేశ్వరరావు.. ఐదు నిమిషాల తర్వాత శివాజీకి ఫోన్ చేసి ఎవరో ప్రచార రథానికి నిప్పు పెట్టి కాల్చేశారని చెప్పారని డీఎస్పీ తెలిపారు. నిందితుడిపై ఐపీసీ సెక్షన్ 435 కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అతడిపై చాలా ఏళ్ల క్రితం ఓ కేసు ఉన్నట్లు తెలుస్తోందని.. పూర్తి వివరాలపై ఆరా తీస్తున్నామన్నారు. కేసును మూడు రోజుల్లో ఛేదించిన బొమ్మూరు సీఐ ఎండీ ఉమర్, ఎస్ఐ బి.శ్రీను, ఆర్.అంకారావు, కె.జగన్మోహన్‌రావు(కొవ్వూరు టౌన్), హెచ్‌సీలు పి.వెంకటేశ్వరరావు(బొమ్మూరు), కె.సురేశ్‌బాబు(అనపర్తి), కానిస్టేబుళ్లు కె.సురేశ్‌బాబు(బొమ్మూరు), కె.తిరుమల యాదవ్(బిక్కవోలు) బృందాన్ని ఎస్పీ జగదీశ్ ప్రత్యేకంగా అభినందించారు.

మైండ్ బ్లోయింగ్ ప్లాన్

కేసును ఛేదించడానికి పోలీసులు చాలా కష్టబడాల్సి వచ్చింది. భరత్ కార్యాలయానికి దూరంగా ఉన్న ఒక షెడ్డులో ఈ రథాన్ని ఉంచారు. అక్కడి సీసీ కెమెరాలు అంతదూరం పని చేయవు. దీంతో ఓ స్కూలు వద్ద ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా కేసును ఛేదించారు. గతంలో తమ దర్యాప్తుల్లో ఎన్నడూ చూడని ప్లాన్‌ని నిందితుడు, వైసీపీ కార్యకర్త దంగేటి శివాజీ వేయడం చూసి నివ్వెరపోయారు. యూట్యూబ్‌లో వీడియోలు వెతికి ఈ ప్లాన్ ఎంచుకున్నట్లుగా తెలుస్తోంది. మామూలు ప్లాస్టిక్ కవరైతే వెంటనే కాలిపోతుందని అల్యూమినియం ఫాయిల్ కవర్‌లో పెట్రోలు నింపుకున్నాడు. దానిని వెలిగిస్తే ఒక్కసారిగా పెద్ద మంటలు వచ్చి జనం గుమిగూడతారని దోమల చక్రానికి అగ్గిపుల్లలు కట్టాడు. ఆ దోమల చక్రం నెమ్మదిగా వెలుగుతూ అగ్గిపుల్లల వద్దకు వచ్చే సరికి సమయం పడుతుంది. దీంతో ఎవరికీ అనుమానం రాదని ప్లాన్ వేశాడు. ఈ సరంజామాను వ్యానుపై పెడితే పెద్దగా ఫలితం ఉండదని టైరుపై ఉంచాడు. టైరు రబ్బరు కావడంతో మంటలు వేగంగా వ్యాపించాయి. కాగా.. 28 రాత్రి ఘటన జరగ్గా 2వ తేదీన పోలీసులకు వైసీపీ నగరాధ్యక్షుడు అడపా శ్రీహరి ఫిర్యాదు అందజేయడంతో అప్పట్లోనే అనుమానాల వ్యక్తం కావడం గమనార్హం.

160 కిలోల గంజాయి స్వాధీనం

మోతుగూడెం, జూలై 4: డొంకరాయి పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న చెక్‌పోస్టు వద్ద గురువారం డొంకరాయి ఎస్ఐ శివకుమార్ తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేయగా 160 కిలోల గంజాయిని రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను, 2 ఆటోలను అదుపులోకి తీసుకున్నారు. పాల్వంచ గ్రామానికి చెందిన షేక్ అక్బర్ హైదరాబాద్‌కు చెందిన షేక్ ఖాజావలి నాలుగు రోజుల క్రితం భద్రాచలం నుంచి సీలేరుకు పాసింజర్‌లను ఎక్కించుకుని అనంతరం పాసింజర్‌లను సీలేరులో దింపి సీలేరులోనే నాలుగురోజులు జల్సాగా తిరిగారు. సీలేరులో ఒక వ్యక్తి వారి వద్దకు వచ్చి గంజాయి భద్రాచలం తీసుకెళ్తే రూ.30 వేలు కిరాయి ఇస్తామని చెప్పడంతో ఆటోలో 80 కిలోల గంజాయి చొప్పున రెండు ఆటోల్లో 160 కిలోల గంజాయి పెట్టుకుని గురువారం సీలేరు నుంచి భద్రాచలం బయలుదేరు తుండగా గంజాయి రవాణా చేస్తున్న సదురు రెండు ఆటోలను వెహికల్ చెకింగ్ చేస్తున్న డొంకరాయి ఎస్ఐ శివకుమార్ పట్టుకుని గెజిటెడ్ అధికారి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వెంకట నానాజీ, వీఆర్వో సందీప్‌ఆచార్యులు, సురేష్ సమక్షంలో సీజ్ చేసి షేక్ అక్బర్, షేక్ ఖాజావలిను అరెస్ట్ చేశారు. చింతూరు సీఐ గజేంద్రకుమార్ ఆదేశాల మేరకు రంపచోడవరం జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్‌కు రిమాండ్ నిమిత్తం తరలించారు.

100 కిలోల గంజాయితో అరెస్టు

చింతూరు, జూలై 4 : చింతూరు పోలీసులు గురువారం వంద కిలోల గంజాయితో పాటు రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. చింతూరు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు మేరకు.. చింతూరు పోలీసు స్టేషను ముందు వాహన తనఖీలు చేస్తుండగా తెలంగాణ వైపు వెళుతున్న రెండు కార్లు అనుమానాస్పదంగా కనిపించాయి. దీంతో కార్లను నిలువరించి విచారణ చేపట్టగా ఆయా కార్లలో ప్రయాణిస్తున్న వారు 100 కిలోల గంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో గంజాయి తరలింపునకు పాల్పడ్డ నలుగురు నిందితులతో పాటు కార్లకు పైలట్‌గా వ్యవహరించిన మరో ఇద్దరిని కూడా అదుపులోకి తీసుకున్నారు. తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా, తొర్రూర్ మండలం హరిపిరాల గ్రామానికి చెందిన హపవత్ రమేష్, అదే గ్రామానికి చెందిన బాణోత్ రవీందర్, ప్రకాశం జిల్లా కొండపి గ్రామానికి చెందిన మాదాల వెంకటేశ్వరరావు, ఒడిసా రాష్ట్రం, మల్కానగిరి జిల్లా అల్లూరికోటకు చెందిన మరిగెల వెంకటరావు, అదే గ్రామానికి చెందిన మరిగెల సత్తి, మరిగెల చంటిబాబు అరెస్టైన వారిలో ఉన్నారు. వారి నుంచి రూ. 1 లక్షా 40 వేలు కూడా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

డయేరియా నుంచి కోలుకుంటున్న వేద విద్యార్థులు


విద్యార్థుల నుంచి వివరాలు సేకరిస్తున్న వైద్యులు

అన్నవరం, జూలై 4: అన్నవరం దేవస్థానంలో కలకలం రేపిన ఆగమ పాఠశాల విద్యార్థుల డయేరియాకు సంబంధించి పరిస్థితులు పూర్తిగా అదుపులోకి వచ్చాయి. విద్యార్థులు వేగంగా కోలుకున్నారు. గురువారం జిల్లా కలెక్టర్ ఆదేశాలతో రంగరాయ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ ఎస్.పి.ఎం డిపార్ట్‌మెంట్ అధికారి డాక్టర్ రుక్మిణి, డిప్యూటీ జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ సరిత శివసదన్ కాటేజీలో ఉన్న వేద విద్యార్థులను కలిసి ఆరోగ్యంపై ఆరా తీసి పలు సూచనలు చేశారు. అదే విధంగా తాగునీరు, వంట పదార్థాల శాంపిల్స్‌ను గురువారం తీసుకుని వారి వెంట తీసుకెళ్లారు. శాంపిల్స్ రిపోర్టులు శుక్రవారం వస్తాయని తెలిపారు. ఇదిలాఉండగా విద్యార్థులు కోలుకోవడంతో 31 మందికి వారం రోజులు సెలవు మంజూరు చేసి తల్లిదండ్రుల చెంతకు పంపించే ఆలోచనలో ఉన్నారు. శుక్రవారం ఈవో రామచంద్రమోహన్ దీనిపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఆగమ పాఠశాల ప్రాంగణమంతా శానిటైజ్ చేసి మరింత పరిశుభ్రం చేసే పనులు అధికారులు చేపట్టారు. ఏఈవో కృష్ణారావు, సూపరింటెండెంట్ స్వామీజీ పర్యవేక్షణ చేస్తున్నారు.

తెరపైకి ఆ ఐదు పంచాయతీలు

నేడు తెలంగాణ సీఎంను కలవనున్న అఖిలపక్షం

ఎటపాక, జూలై 4: రాష్ట్ర పునర్విభజన సమయంలో భద్రాచలం మండలంలో భద్రాచలం రెవెన్యూ గ్రామం మినహా మిగిలిన గ్రామాలన్నీ పోలవరం ముంపు పేరుతో ఏపీ పరిధిలో కలిశాయి. గత దశాబ్ద కాలం నుంచి ఆ గ్రామాలు పాలనపరంగా ఏపీ పరిధిలో కొనసాగుతున్నాయి. అయితే రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మారడంతో విలీన అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. ఇప్పుడు ఆ ఐదు పంచాయతీలైన ఎటపాక, పిచుకలపాడు, కన్నాయిగూడెం, పురుషోత్తపట్నం, గుండాల గ్రామాలను తిరిగి తెలంగాణలో విలీనం చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. వారం రోజుల క్రితం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆ ఐదు పంచాయతీలు తెలంగాణకు వస్తేనే భద్రాచలం పుణ్యక్షేత్రం అభివృద్ధి చెందుతుందని, ఆ పంచాయతీలను భద్రాచలంలో కలిపేందుకు ఏపీ ప్రభుత్వాన్ని అడుగుతామని చెప్పడంతో ఆ పంచాయతీల విలీన ప్రక్రియపై మరింత వేడి రాజుకుంటోంది. ఈక్రమంలోనే గుండాల, ఎటపాక, కన్నాయిగూడెం పంచాయతీలోని పలు గ్రామాల ప్రజలు రెండు రోజుల క్రితం భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు వినతి పత్రం అందించారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఏపీ పరిధిలో కలిసిన ఎటపాక, పిచుకలపాడు, కన్నాయిగూడెం, పురుషోత్తపట్నం, గుండాల గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలిపి, భద్రాచలం పుణ్యక్షేత్ర అభివృద్ధికి కృషి చేస్తామని ప్రస్తావించారు. అయితే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో ఈ డిమాండ్ ఇటీవల కాలంగా గట్టిగా విన్పిస్తోంది.

తెలంగాణ సీఎంను కలవనున్న అఖిలపక్షం, ప్రజాప్రతినిధులు

శుక్రవారం తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని ఈ ఐదు పంచాయతీల్లోని అఖిలపక్ష నాయకులు, ప్రజాప్రతినిధులు కలవనున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి తమ గోడును వినిపించనున్నారు. ఏపీలో పాలనా పరంగా పడుతున్న ఇబ్బందులను తెలియజేస్తూ తమ గ్రామాలను తిరిగి తెలంగాణలో విలీనం చేయాలని విన్నవించనున్నారు. ఆంధ్రా, తెలంగాణ సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి భేటీ కానుండడంతో ఈ అంశం చర్చకు వస్తుందనే ఆశాభావంతో ఆయా గ్రామాల ప్రజలు ఉన్నారు.

దుర్గాడ శివాలయంలో ప్రత్యేక పూజలు



గొల్లప్రోలు రూరల్, జూలై 4: గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. జ్యేష్టబహుళ త్రయోదశి, తత్కాల చతుర్దశి, మాసశివరాత్రి సందర్భంగా మహాగణపతిపూజ, మహాన్యాసపారాయణ, 11 రుద్రాలు, 21 రకాల ద్రవ్యాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నేరేడుపండ్లు, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు, స్మార్త ఆగమ పండిత విద్యార్థులు అల్లంరాజు రామకృష్ణశర్మ, ఫణిశర్మ, చెరకూరి కారుణ్యశర్మ, కార్తీక్‌శర్మ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రసాద విక్రయ కేంద్రాలు ఏర్పాటు

అన్నవరం, జూలై 4: జాతీయ రహదారిపై రాజమహేంద్రవరం వైపు వెళ్లే భక్తుల కోసం నిర్మించిన సత్యదేవుడి నూతన నమూనాలయం వద్ద ప్రసాదం విక్రయ కేంద్రాలను సిద్ధం చేశారు. ఆషాడమాసంలో తలుపులమ్మ లోవ దర్శించుకుని తిరిగి వెళ్లే భక్తులు అన్నవరం సత్యదేవుడి ప్రసాదాన్ని కొనుగోలు చేసి తమ స్వస్థలాలకు తీసుకెళుతుంటారు. అయితే ఎన్నికలకు ముందు ఆలయాన్ని ప్రారంభించినా పనులు అసంపూర్తిగా ఉండిపోయాయి. లోవ భక్తుల రద్దీ దృష్ట్యా నూతన ప్రసాదం కౌంటర్లు సిద్ధం చేయాలని, ఆషాడమాసం నుంచే విక్రయ కౌంటర్ ప్రారంభించాలని ఈవో ఆదేశించడంతో వెంటనే సిద్ధం చేశారు. ఈనెల 7వ తేదీ మొదటి ఆదివారం కావడంతో 6వ తేదీ నుంచి ప్రారంభించాలని ఆలోచన చేస్తున్నారు. రెండు టిక్కెట్లు కౌంటర్లు, రెండు ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేశారు. అయితే రద్దీని బట్టి రెండో కౌంటర్‌ను వినియోగించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

సీతానగరంలో 11 డయేరియా కేసులు


బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

సీతానగరం, జూలై 4: సీతానగరంలో 11 మంది డయేరియా లక్షణాలతో పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. బాధితులను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ గురువారం పరామర్శించారు. బాధితులకు అందుతున్న సాయంపై ఆరా తీశారు, రోగులకు మరింత మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాలు, ఆహార పదార్థాల శుభ్రత అవసరమన్నారు. గ్రామంలో 11 కేసులు గుర్తించడంతో డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటేశ్వరరావు సీతానగరంలో పర్యటించారు. రోగులను పరామర్శించి స్థానిక పంచాయతీలో ఉన్న వాటర్ ట్యాంక్ నుంచి వస్తున్న కుళాయి వద్ద నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో డయేరియా కేసులున్నాయని, అయితే అవి రికవరీ దిశలో ఉన్నాయన్నారు. అవసరమైన మందులు పీహెచ్‌సీలో ఉన్నాయని, రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నారన్నారు. ఇప్పటికే రెండు సార్లు మెడికల్ క్యాంపులు పెట్టారని, డయేరియా అని కాకుండా సస్పెక్టెడ్ కేసులుగా పరిగణించి వైద్య సేవలందించారని, కారణాలను విశ్లేషిస్తున్నామని చెప్పారు.

కాకినాడలో కల్కి 'బుజ్జి' సందడి



సర్పవరం జంక్షన్, జూలై 4: ప్రముఖ హీరో ప్రభాస్ నటించిన కల్కి సినిమాలో ప్రముఖ పాత్ర వహించిన బుజ్జి కారు కాకినాడలో సందడి చేసింది. సినిమాలో హీరోకు ఉన్న ప్రాధాన్యం బుజ్జి కారుకు లభించింది. సినిమాలో ఈ కారు చేసే విన్యాసాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టున్నాయి. ఈ కారును గురువారం కాకినాడ రూరల్ సర్పవరం జంక్షన్‌లో ఎస్ఆర్ఎంటీ మాల్‌లో ఈవెంట్ నిర్వాహకులు అందుబాటులో ఉంచారు. దీనిని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి సందర్శకులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ స్తంభించడంతో ట్రాఫిక్ సీఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది క్రమబద్ధీకరించారు.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణ విషయంలో ఘోర తప్పిదాలు

ప్రాజెక్టులో జరిగిన తప్పిదాలు, ఖర్చులు, నష్టాలపై హైకోర్టులో పిల్ వేస్తా

అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్



రాజమహేంద్రవరం సిటీ, జూలై 4 : పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో అనేక ఘోర తప్పిదాలు జరిగాయని అమలాపురం మాజీ ఎంపీ జీవి హర్షకుమార్ ఆరోపించారు. రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ విద్యాసంస్థల్లో తన చాంబర్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. 2004లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా పోలవరానికి అంకురార్పణ చేశారని చెప్పారు. అటుపై కిరణ్ కుమార్ రెడ్డి, రోశయ్య, విభజిత ఏపీలో టీడీపీ అధినేత చంద్రబాబు నిర్మాణాలు కొనసాగించారని చెప్పారు. కానీ ప్రభుత్వాలు మారినప్పుడల్లా పోలవరం ప్రాజెక్టు నిర్మాణ సంస్థలు, ఇంజనీర్లు మారిపోయారని చెప్పారు. తొలుత శీనయ్య కమిటీ ఈ ప్రాజెక్టు విషయంలో స్పష్టంగా చెప్పిందని రెండు డయా ఫ్రం వాల్స్ నిర్మించాలని సూచించిందన్నారు. కాని ఒకటే నిర్మించారని చెప్పారు. ఇది ఘోర తప్పిదమన్నారు. ప్రపంచంలో అన్ని ప్రాజెక్టులు రాతి పొరల మీద నిర్మించారు. నాగార్జున సాగర్ డ్యామ్ కూడా రాతి పొర మీదే అయితే పోలవరం నిర్మించేది ఇసుక పొరల మీద అని ఇది చాలా స్ట్రాంగ్‌గా నిర్మించాలన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో నిర్మాణాలు జరిగితే జగన్ ప్రభుత్వంలో మళ్లీ ఇంజినీర్లు కంపెనీలు మార్చి నిర్మించారన్నారు. 50 లక్షల క్యూసెక్కులు నీరు వచ్చిన తట్టుకునేలా స్పిల్‌వే నిర్మాణం చేశారు కానీ డయా ఫ్రం వాల్ విషయంలో తప్పు చేశారన్నారు. దీని వల్ల వరదల సమయంలో ఏ మాత్రం తేడా వచ్చినా తూర్పుగోదావరి నుంచి కాకినాడ జిల్లా వరకు మొత్తం గల్లంతై పోతాయన్నారు. చాలా శ్రద్ధ తీసుకుని ముందుజాగ్రత్తలు తీసుకుని ప్రాజెక్టు నిర్మాణం చేయాలన్నారు. రెండు డయాఫ్రం వాల్స్ కడితేనే ప్రమాదం ఎదుర్కొనగలమన్నారు. ఒక దానికి ఒకదానికి మధ్య 3 నుంచి 5 మీటర్లు గ్యాప్‌లు ఉండాలని శీనయ్య కనస్ట్రక్షన్ కంపెనీ నిర్దేశించిందన్నారు. అయితే ఉమ్మడి రాష్ట్రంలో ఇంజినీరు సీతాపతిరావుతో పాటు చాలా మంది రెండు డయాఫ్రం వాల్స్ అవసరం లేదని ఒకటి చాలు అని చెప్పడం, దీని వల్ల ఖర్చుతగ్గుతుందని చెప్పారని ఇది కరెక్ట్ కాదన్నారు. ఖర్చు తగ్గడం ముఖ్యమా భద్రత ముఖ్యమా అని ప్రశ్నించారు. ఇటీవల సీఎం చంద్రబాబు శ్వేతపత్రం విడుదల చేశారని కాఫర్ డ్యామ్ నుంచి సీపేజ్ వస్తుందని వాటిని అరికట్టే చర్యలు తీసుకుని ముందుకు సాగాలని, డయా ఫ్రం వాల్ కొట్టుకుపోయింది దానిని నిర్మాణం చేపట్టాలన్నారు. 2018లోనే కాఫర్ డ్యామ్‌తో డేంజర్ అని పత్రికాముఖంగా తాను చెప్పానన్నారు. ఇప్పుడు విదేశీయుడిని తీసుకువచ్చి సరిగ్గా కట్టలేదంటే కాంట్రాక్టర్ల వైఫల్యమా, ప్రభుత్వాల వైఫల్యమా అని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో ఎల్అండ్‌టీ, నవయుగ, మెగా కంపెనీలను బాధ్యులుగా చేసి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రజల సొమ్ము వృథా అయ్యిందని తప్పు ఎవరదని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టును ప్రభుత్వాలు ఏటీఎంలుగా చేసుకున్నాయి తప్ప భద్రత పట్టించుకోలేదన్నారు. గైడ్ బండ్ కుంగిపోయిన సంఘటనపై కూడా వాళ్లిచ్చిన వివరణ సహేతుకంగా లేదన్నారు. ప్రాజెక్టు విషయంలో జరిగిన తప్పులు, ఖర్చులు నష్టాలపై హైకోర్టులో తాను పిల్ వేస్తానని చెప్పారు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి



ఆలమూరు, జూలై 4: మండలంలోని మూలస్థానం గ్రామానికి చెందిన రేలంగి సూర్యనారాయణ (60)ను కారు ఢీకొనడంతో మృతిచెందారు. సూర్యనారాయణ పువ్వుల వ్యాపారం చేస్తుంటారు. గురువారం జొన్నాడ నుంచి ఇంటికి తిరిగి వెళ్తుండగా మూలస్థానం వద్ద రావులపాలెం నుంచి రాజమహేంద్రవరం వెళ్తున్న కారు బలంగా ఢీకొంది. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. కేసు నమోదు చేయగా ఆలమూరు ఎస్ఐ శ్రీనునాయక్ దర్యాప్తు చేస్తున్నారు.

ఒంటరి మహిళపై ఆటోడ్రైవర్ దాడి


స్పృహతప్పి పడిపోయిన మహిళ

రౌతులపూడి, జూలై 4: కాకినాడ జిల్లా రౌతులపూడి సినిమా సెంటర్‌లో ఒంటరి మహిళపై ఆటో డ్రైవర్ దాడి చేశాడు. తీవ్రంగా కొట్టడంతో స్పృహ తప్పిపడిపోయింది. వ్యాపారస్తులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. ములగపూడి గ్రామానికి చెందిన కె.లక్ష్మి ఆటోలో రౌతులపూడి వచ్చింది. ఆటోలో నుంచి దిగిన మహిళపై అక్కడే ఉన్న వీరాస్వామి అనే ఆటో డ్రైవర్ ఒక్కసారిగా విచక్షణారహితంగా దాడి చేశాడు. దీంతో లక్ష్మి స్పృహ తప్పిపడిపోయింది. తనపై కేసు పెడతావా అంటూ ఆటోడ్రైవర్ దాడి చేశాడని వ్యాపారస్తులు, స్థానికులు తెలిపారు. విషయం తెలిసి లక్ష్మి బంధువులు రావడంతో ఆటో డ్రైవర్ పరారయ్యాడు. బంధువులు లక్ష్మిని తీసుకుని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని జట్టు కూలీ మృతి

అమలాపురం రూరల్, జూలై 4: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఎర్ర వంతెన వద్ద జట్టు కూలీగా పని చేస్తున్న తొత్తరమూడి బులి సత్యనారాయణ (52) పని ముగించుకుని గురువారం రాత్రి సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా భట్నవిల్లి జాతీయ రహదారిపై వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్య కాపురానికి రావడం లేదని వ్యక్తి ఆత్మహత్య

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 4 : భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కె.గంగవరం మండలం దంగేరు గ్రామానికి చెందిన మెల్లిమి రాజుకు వివాహం జరిగింది. భార్యతో మనస్పర్ధలు కారణంగా విడిగా ఉంటున్నాడు. కొత్తూరు గ్రామంలో టిడ్కో గృహంలో నివసిస్తున్నాడు. భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో రోజూ మద్యం సేవిస్తున్నాడు. రాజు తల్లి విజయలక్ష్మి పింఛను నిమిత్తం ఈనెల 1న దంగేరు గ్రామం వెళ్లింది. 2వ తేదీన రాజు తల్లి విజయలక్ష్మికి ఫోన్ చేసి తన భార్య వచ్చి గొడవపడి వెళ్లినట్లు తెలిపాడు. గురువారం ఉదయం 11 గంటలకు విజయలక్ష్మి టిడ్కో గృహం వద్దకు వచ్చి చూడగా తలుపులు వేసి ఉంది. కిటికిలో నుంచి చూడగా లోపల నుండి వాసన వస్తుంది. చుట్టుపక్కల వారిసాయంతో తలుపులు తెరచి చూడగా బెడ్‌రూమ్‌లో చీరతో రాజు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతిచెంది ఉన్నాడు. దీంతో విజజయలక్ష్మి ఫిర్యాదుతో ఎస్ఐ కె.సురేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

అయినవిల్లి, జూలై 4: మండలంలోని వీరవల్లిపాలెం గ్రామానికి చెందిన అడపా ప్రేమ్‌కుమార్ (29) గురువారం ఇంట్లో విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే కుటుంబ సభ్యులు అమలాపురం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు వారు తెలిపారు. ఈ ఘటనపై అతని సోదరుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాజేష్‌కుమార్ తెలిపారు. ప్రేమ్‌కుమార్‌కు భార్య రమాదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్టు గ్రామస్తులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

ప్రత్తిపాడు, జూలై 4: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం జాతీయ రహదారిపై గురువారం వాహనం ఢీకొన్న సంఘటనలో యువకుడు మృతిచెందాడు. ధర్మవరం శివారు పెట్రోల్ బంకు సమీపంలో రహదారిపై నడుస్తున్న గుర్తు తెలియని 30 ఏళ్ల యువకుడిని రాజమహేంద్రవరం నుంచి తుని వైపు వెళుతున్న గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ప్యాంటు, చొక్కా ధరించి ఉన్నాడు. యువకుడు ఆచూకీ తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్పత్రికి వెళ్లి వస్తూ..

ప్రైవేటు బస్సు ఢీకొని భార్య మృతి..

భర్తకు తీవ్రగాయాలు


మృతిచెందిన లక్ష్మి

తొండంగి, జూలై 4: ఒంట్లో నలతగా ఉండడంతో ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకుని బయలుదేరిన ఆమె ఇంటికి చేరకుండానే ప్రమాదానికి గురై మృతిచెందింది. గురువారం కాకినాడ జిల్లా తొండంగి మండలం బెండపూడి శివారు రావికంపాడు సెంటర్ సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఎద్దు లక్ష్మి అనే మహిళ మృతి చెందగా ఆమె భర్తకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు అందించిన వివరాల ప్రకారం రావికంపాడు గ్రామానికి చెందిన ఎద్దు లక్ష్మి(53) అనారోగ్యంతో బాధపడుతుండడంతో భర్త జగ్గయ్య ఆమెను మోటార్ సైకిల్‌పై కత్తిపూడి ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకువెళ్లారు.తిరిగి అన్నవరం వైపు వస్తుండగా వెనుక నుంచి ప్రైవేట్ బస్సు ఢీకొట్టడంతో లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. భర్త జగ్గయ్యకు తీవ్ర గాయాలు కావడంతో తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. తొండంగి ఎస్ఐ వినయ్ ప్రతాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

ఇసుక ట్రాక్టర్, ఎక్స్‌కవేటర్ సీజ్

మలికిపురం, జూలై 4: మలికిపురం పోలీసుస్టేషన్ పరిధిలో తూర్పుపాలెంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టరు, ఎక్స్‌కవేటర్‌ను పోలీసులు గురువారం సీజ్‌చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ బి.సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడిచేసి అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలను అడ్డుకుని స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ జి.అనితకుమారి తెలిపారు.

అల్లూరి త్యాగనిరతి చిరస్మరణీయం

● అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ● ఘనంగా అల్లూరి జయంతి



రావులపాలెం: అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

అల్లవరం, జూలై 4: బ్రిటీష్ వారిని గడగడలాడించిన విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజు త్యాగనిరతి చిరస్మరణీయమని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. సీతారామరాజు జయంతి సందర్భంగా కోడూరుపాడులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు, సర్పంచ్ నడింపల్లి సుబ్బరాజు, వేగిరాజు వెంకట్రాజు, గుబ్బల రాంప్రసాద్, కేవీ, నార్గన శ్రీను పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఆనందరావును క్షత్రియ పరిషత్ నాయకులు సత్కరించారు. గుండెపూడిలో అల్లూరి జయంతి వేడుకల్లో గుంటూరి బాలరాజు, కె.కాశీరాజు, గుంటూరి శ్రీనురాజు పాల్గొన్నారు. కొమరగిరిపట్నం, రెల్లుగడ్డ గ్రామాల్లో అల్లూరి జయంతి నిర్వహించారు.

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారం, తొండవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో అల్లూరి సీతారామరాజు జయంతి నిర్వహించారు. హెచ్ఎం కేశవాచార్యులు, ఉపాధ్యాయులు శశికుమార్, ఎంఎస్ఎస్ కుమారి, సూర్యచంద్రరావు, ఎం.వెంకటేశ్వరరావు, ఎం.రాంబాబు, ఎం.చంద్రరావు, పినిపే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనరు జి.వెంకట్రామిరెడ్డి, చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేనేజరు పీవీ నూకరాజు, అసిస్టెంట్ మేనేజరు కె.సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ కె.సత్యనారాయణరాజు, కె.సంధ్యారాణి, జి.శ్రీహరి, ఎం.ప్రవీణ్, జి.సూర్యసునీత, ఎ.హిమబిందు పాల్గొన్నారు. చినకొత్తలంక ప్రధాన కూడలిలో ఉన్న సీతారామరాజు నిలువెత్తు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పి.ఉదయభాస్కరవర్మ, ఎం.పద్మనాభరాజు, టి.నాగేంద్రవర్మ, పి.శ్రీనివాసవర్మ, పి.ఫణివర్మ, పి.వినయవర్మ, పి.సాయివర్మ, టి.లక్ష్మీశ్రీనివాసరాజు, పీటీవీ వర్మ, సర్పంచ్ పొత్తూరి ఉమారాణి, ఎంపీటీసీ పి.వీణారాణి, పి.సత్యనారాయణరాజు, పి.రామరాజు, పి.పద్మప్రియ, పి.మంగ, పి.శ్రీలక్ష్మి, పి.మల్లపరాజు, పి.వెంకటపతిరాజు పాల్గొన్నారు.

పి.గన్నవరం: అక్విడెక్టువద్ద గల సీతారామరాజు విగ్రహానికి, రాజులపాలెం క్షత్రియ యూత్ ఆధ్వర్యంలో సీతారామ రాజు విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ బొండాడ నాగమణి, సంసాని పెద్దిరాజు, శిరిగినీడి వెంకటేశ్వరావు, వాసంశెట్టి కుమార్, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, తోలేటి సత్తిబాబు, కత్తుల శ్రీను, యడ్ల ఏసు, శేరు శ్రీను బాబు, అన్నాబత్తుల హనుమాన్, తాటికాయల శ్రీనివాసరావు, పేరిచర్ల నాగరాజు, కొల్నాడ సత్యనారాయణరాజు, వుయ్యూరి వెంకటరామరాజు, వేటుకూరి సూరిబాబురాజు, సూర్యనారాయణరాజు, నారాయణరాజు, దొరబాబు పాల్గొన్నారు.

మామిడికుదురు: మగటపల్లిలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు పూలమా లలు వేసి నివాళులర్పించారు. పాశర్లపూడి, పెదపట్నంలంక, మామిడికుదురు పంచాయతీ కార్యాలయాల వద్ద అల్లూరి జయంతి నిర్వహించారు. టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, బోనం బాబు, మద్దాల పెద్దకాపు, సర్పంచ్‌లు గౌస్ మొహిద్దీన్, సుందరనీడి చిన్ని, ఎంపీటీసీలు నామన వెంకటేశ్వరరావు, కొమ్ముల జంగమయ్య పాల్గొన్నారు.

ఆత్రేయపురం: ఆత్రేయపురం రావిచెట్టు సెంటరు, సీతారామరాజు పార్కువద్ద అల్లూరి విగ్రహాలకు టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు పూలమాలలు వేశారు. వందల సంఖ్యలో క్షత్రియులు పాల్గొన్నారు. ఆత్రేయపురం మహత్మాగాంధీ విద్యాసంస్థల్లో అల్లూరి చిత్రపటానికి సెక్రటరీ-కరస్పాండెంట్ పీఎస్ రాజు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉప్పలగుప్తం: భీమనపల్లిలోని శిరంగు రంగనాయకమ్మ జడ్పీ హైస్కూల్లో అల్లూరి జయంతి నిర్వహించారు. హెచ్ ఎం నూకల సత్యనారాయణ, పీడీ కామన మధు, ఉపాధ్యాయులు అరవ నాయుడు, నడింపల్లి పద్మనాభన్, కరాటం ప్రసాద్, శివనాగరాజు, శ్రీనివాస్, శారద, లక్ష్మి పాల్గొన్నారు. ఎస్.కొత్తపల్లి రాజుపాలెంలో అల్లూరి జయంతిని నిర్వహించారు.

మండపేట: ఏడిద సీతానగరం గ్రామానికి చెందిన శ్రీకోదండరామక్షత్రీయ సేవాసమితి సభ్యుల ఆధ్వర్యంలో ఏడిద సీతానగరంలో అల్లూరి విగ్రహానికి సభ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండపేట మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారా ణి, కమిషనర్ బి.రాము, తదితరులు అల్లూరి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ద్వారపూడి, మండపేటలో సీఐటీయూ ఆధ్వర్యంలో అల్లూరి జయంతిని నిర్వహించారు. కార్యక్రమం లో క్షత్రీయసేవా సమితి సభ్యులు, మాజీ ఎంపీటీసీ పెన్మె త్సరమేష్‌రాజు, మాజీ సర్పంచ్ ముదునూరి రంగరాజు, పెన్మెత్స సత్యన్నారాయణరాజు, నంబూరి సుబ్బరాజు, సాగి రాజు సురేంద్రవర్మ, అయినం పూడి నాగరాజు, చామంతిపూడి వీర్రాజు, సాతపాటి సత్యన్నారాయణరాజు పాల్గొన్నారు.

రావులపాలెం: పొడగట్లపల్లిలో సీతారామరాజు విగ్రహానికి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కూటమి నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర, కపిలేశ్వరపురం, తదితర గ్రామాల్లో అల్లూరి విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో అంగర ఎస్ఐ ఎ.పరదేశి, అంగర పీహెచ్‌సీ ఎంపీహెచ్ఎస్ జె.మల్లిఖార్జునుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పి.గన్నవరం అక్విడెక్టువద్ద అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రాయవరం: బీజేపీ నేత లొల్ల సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు, బీజేపీ నేతలు మెయిన్‌రోడ్డు సమీపంలో ఉన్న అల్లూరి విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళుల ర్పించారు. బీజేపీ నేతలు శాకా దుర్గా శ్రీనివాస్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, నరాల రాంబాబు, ఈరెల కృష్ణమూర్తి, గుబ్బల వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది: సఖినేటిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, మాజీ సర్పంచ్ జంపన బుజ్జిరాజులు సీతారాముల విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం సీతారామరాజు వీరోచిత పోరాటాల గురించి పలువురు కొనియాడారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

యానాం: మన్యం వీరుడు అల్లూరి విగ్రహానికి ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి, ఎస్పీ రాజశేఖరన్, మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, సీఐ షణ్ముగం తదితరులు పూలమాలలు వేసినివాళులర్పించారు. జాతీయ జెండ రూపకర్త పింగళి వెంకయ్య, సంఘ సంస్కర్త స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా ఫెర్రిరోడ్డలోని వారి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులపర్పించారు. యానాం క్షత్రియపరిషత్, క్షత్రియయూత్ పోర్స్ ఆధ్వర్యంలో అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో రాముర రాజు, దాట్ల దేవదానం రాజు, వెంకట కృష్ణంరాజు, వర్మ, ముదుపూరి సహదేవరాజు, సుబ్బరాజు, జేఆర్‌కె తదితరులు పాల్గొన్నారు.

రంగా నేటి తరాలకు స్ఫూర్తిదాత

● ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు
● ఘనంగా రంగా జయంతి



ఆలమూరులో రంగా జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం

మండపేట, జూలై 4: స్వర్గీయ వంగవీటి మోహనరంగా నేటి తరాలకు స్ఫూర్తిప్రదాత అని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. పట్టణ కాపు అభ్యుదయ సంఘాధ్యక్షుడు జిన్నూరి సాయిబాబా సారధ్యంలో రంగా జయంతిని గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే రంగా విగ్రహానికి స్థానిక కాపు నేతలతో కలిసి పూలమాలలు వేసినివాళులర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, సాదనాల శివ,యాళ్లశ్రీను, జోన్నపల్లి సత్తిబాబు, శ్రీను పాల్గొన్నారు.

ఆలమూరు: ఆలమూరు మండల కాపు సంఘం అధ్యక్షుడు చల్లా ప్రభాకరరావు ఆధ్వర్యంలో ఆలమూరు మెయిన్‌రోడ్డులోని రంగా విగ్రహానికి పూలమాలలువేసి నివాళుల ర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. రిక్షా కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. నాయకులు రామానుజుల శేషగిరిరావు, చల్లా నానాజీ, చల్లా వెంకటేశ్వరరావు, డీపీ రావు పాల్గొన్నారు. రంగా విగ్రహానికి కూటమి నాయకులు వంటిపల్లి సతీష్, ఈదల నల్లబాబు పూలమాలలువేసి నివాళుల ర్పించారు.

అంతర్వేది: అంతర్వేది సైకిల్‌షాపు సెంటర్, కేశవదాసుపాలెం కాల్వమొగ సెంటర్, టేకిశెట్టిపాలెం, సఖినేటిపల్లిలంక, సఖినేటిపల్లి తదితర గ్రామాల్లో వంగవీటి రంగా జయంతిని నిర్వహించారు. అంతర్వేది, కేశవదాసుపాలెం కాల్వమొగ సెంటర్‌లో మాజీ సర్పంచ్ పోతురాజు నాగేంద్రకుమార్ అధ్యక్షతన రంగా విగ్రహానికి భారీ గజమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గన్నాబత్తుల సత్యనారాయణ, పోతురాజు శ్రీవెంకటకృష్ణ, కొమ్ముల తాతాజీ, ఉండపల్లి అంజి, జిల్లెల్ల నరసింహ, అడబాల శ్రీను, యెనుముల రమణ, బెల్లంకొండ ఏసు, దూది త్రినాథ్, చొప్పల బాబూరావు పాల్గొన్నారు.

అల్లవరం: మండలంలోని అల్లవరం, డి.రావులపాలెం, ఈటివారిపాలెం, కొమరగిరిపట్నంల్లో రంగా జయంతి నిర్వహించారు. టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు, జనసేన మండల నాయకుడు కంకిపాటి వీరబాబు, బండిగుప్తాపు సత్తిబాబు, రంగ, శ్రీవెంకన్న, సుంకర సాయి, కంకిపాటి సుబ్బరావు, కాకిలేటి సాయిరాం పాల్గొన్నారు.

అంబాజీపేట: అంబాజీపేట జడ్పీ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న రంగా విగ్రహానికి పలువురు నివాళులర్పిం చారు. ఇరుసుమండలో రంగా విగ్రహానికి జనసేన నాయకుడు అక్కిశెట్టి వీర వెంకట సత్యనారాయణ పూలమాల వేశారు. కార్యక్రమంలో గణపతి వీరరాఘవులు, కొర్లపాటి గోపి, దొమ్మేటి సాయికృష్ణ, కొర్లపాటి డిల్లీ, బొంతు పెదబాబు, మోటూరి చిన్న, వీరంశెట్టి దుర్గాప్రసాద్, రంకిరెడ్డి వీర్రాజు పాల్గొన్నారు.

పి.గన్నవరం: అక్విడెక్టువద్ద రంగా విగ్రహానికి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. జేఎస్పీ నాయకుడు అడ్డగళ్ల వెంకటసాయిరాం ఆధ్వర్యంలో రంగా విగ్రహానికి పూలమాలలు వేశారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, బొండాడ నాగమణి, సంసాని పెద్దిరాజు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, తోలేటి సత్తిబాబు, ఆదిమూలం సూర్యనారాయణ, పప్పుల సాయిబాబు, యడ్ల ఏసు, షేక్ దొరబాబు, శేరు శ్రీనుబాబు, తాటికాయల శ్రీనివాసరావు, పెచ్చెట్టి ఈశ్వర్, కర్రి బాబురావు, నల్లా పెద్దకాపు, చింతపల్లి నందు పాల్గొన్నారు.

మామిడికుదురు: పెదపట్నంలంకలో సర్పంచ్ సుందరనీడి రాజేష్‌కుమార్, ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మామిడికుదురులో కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. జనసేన నాయకులు, రంగా అభిమానులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: ఉచ్చిలి, లొల్ల, వాడపల్లి, మెర్లపాలెం, ర్యాలి, నార్కెడుమిల్లి గ్రామాల్లో రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంగా అభిమానులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి సెంటర్లో రంగా విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అరిగెల నానాజీ, ఆకుల సూర్యనారాయణమూర్తి, మద్దింశెట్టి సురేష్, సలాది నాగరాజు, చీకట్ల ఏసు, చిక్కం సూర్యమోహన్, సుంకర బుజ్జి, పైబోడి పండు, మద్దింశెట్టి ప్రసాద్, యెరుబండి భద్ర, గనిశెట్టి కిశోర్, సలాది పెదసత్యం, గనిశెట్టి రాము, గనిశెట్టి శివ పాల్గొన్నారు. విలసవిల్లిలో సలాది సతీష్ ఆధ్వర్యంలో రంగా జయంతి జరుపుకున్నారు.

రామచంద్రపురం/ద్రాక్షారామ: చప్పిడివారి సావరంలో రంగా విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, కౌన్సిలర్ అంకం శ్రీనివాస్, కాపు సంఘం గౌరవాధ్యక్షుడు అరిగెల నాగేశ్వరరావు, అధ్యక్షుడు నారపరెడ్డి బలరామ్, కనకాల వెంకటేశ్వరరావు, అక్కల ఠాగూర్, కంచుమర్తి బాబూరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● ద్రాక్షారామలో వంగవీటి మోహనరంగా విగ్రహానికి వైస్ ఎంపీపీ శాకాబాబి, సర్పంచ్‌లు కొత్తపల్లి అరుణ, పెమ్మిరెడ్డి దొరబాబు, అనిశెట్టి రామకృష్ణ, జెడ్పీమాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, కర్రిఅబ్బు, మాగాపు అమ్మిరాజు, నామా వెంకన్నబాబు, తోటబాబులు, డా.రాంబాబు, ఆళ్లబుజ్జి తదితరులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఉట్రుమిల్లిలో రంగా విగ్రహానికి మాజీ ఉపసర్పంచ్ సున్న చిట్టిబాబు, కనకాల వెంకటేశ్వరరావు, నల్లసుదాకర్, నల్ల వెంకటేష్, ఆక్కిరెడ్డి శ్రీను, చిక్కాలస్వామికాపు నివాళులర్పించారు.

కె.గంగవరం: మండలంలోని కె.గంగవరం, సత్యవాడ, పామర్రు గ్రామాల్లో ఆయా గ్రామాల్లో కాపునాయకులు రంగా విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులు అర్పించారు. మిఠాయిలు పంచారు. కె.గంగవరంలో జరిగిన కార్యక్రమంలో సలాది వెంకన్న, తాడాల రాంబాబుల ఆధ్వర్యంలో 200 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

రావులపాలెం: గోపాలపురం జాతీయ రహదారి సెంటర్లో ఉన్న రంగా విగ్రహానికి టీడీపీ సీనియర్ నాయకుడు ఆకుల రామకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. మండలంలోని పలు గ్రామాల్లో రంగా జయంతిని ఘనంగా నిర్వహించారు.

కపిలేశ్వరపురం: మండలంలోని జనసైనికుల ఆధ్వర్యంలో జనసేన పార్టీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ వేగుళ్ళ లీలాకృష్ణ రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంగర గాంధీ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో పుత్సల శ్రీనివాస్, పిల్లా బసవరాజు, మత్సా గంగరాజు, మేడేపల్లి కొండ, చీకట్ల శ్రీను, యానాల సుబ్బారావు, సిద్ధిరెడ్డి శ్రీను, గంగ్రోతుల పట్టాభి, ఆటో కార్మికులు, తాపీమేస్త్రి, యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొని రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రంగా విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే దేవ

రాజోలు: బి.సావరంలో గురువారం స్వర్గీయ వంగవీటి మోహనరంగా జయంతి సందర్భంగా ఏర్పాటుచేసిన విగ్రహాన్ని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, రాష్ట్ర మాలమహానాడు అధ్యక్షుడు జగడం సత్యనారాయణ, కుంపట్ల చిన్నారి, పామర్తి రమణ, గుండుబోగుల పెద్దకాపు, ఎంపీటీసీ దార్ల కుమారిలక్ష్మి, రావి మురళీ పాల్గొన్నారు.

రాజోలు: తాటిపాక సెంటర్‌లో రంగా విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కటికిరెడ్డి బుజ్జి, పోతు కాశీ, గుండాబత్తుల తాతాజీ, సాధనాల రమేష్, తాటికాయల బాబులు, లంకలపల్లి సుబ్బారావు, బోనం ఫణి, కటికిరెడ్డిసుబ్రహ్మణ్యం, గుండాబత్తుల కోటి, ఏపుగంటి సత్యనారాయణ, ఆకుల రమేష్ పాల్గొన్నారు.



మండపేటలో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

కొత్తపేట: వాడపాలెం సెంటర్లోని రంగా విగ్రహానికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, పాతబస్టాండ్ సెంటర్లో కంఠంశెట్టి శ్రీనివాస్, బూసి భాస్కరరావు తదితరులు రంగాకు నివాళులర్పించారు. ముత్యాల బాబ్జీ, అద్దంకి చంటిబాబు, పెనుమల్ల అన్నవరం, ముద్రగడ సుబ్బారావు, చోడపనీడి భాస్కరరావు, త్సామా బాబు, బండారు రాజేష్, బండారు బుల్లితాత, బండారు వీరబాబు, చీకట్ల అబ్బు తదితరులు పాల్గొన్నారు.

రాయవరం: మండలంలోని సోమేశ్వరంలో దివంగత కాపునేత వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కాపునాడు మండలాధ్యక్షుడు నున్న వెంకటరమణ ఆధ్వర్యంలో రంగా విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. కార్యక్రమంలో దూళిపూడి వీరబాబు, మేడిశెట్టి నాగయ్య, నిమ్మకాయల బద్రీనారాయణ, చిన్నబాజ్జి, రామకృష్ణ, ఆదినారాయణ పాల్గొన్నారు.

అమలాపురం రూరల్/టౌన్: ఈదరపల్లి రంగా సెంటర్లో రంగా టీమ్ అధ్యక్షుడు యల్లమిల్లి నాగసుధాకొండలరావు ఆధ్వర్యంలో వంగవీటి మోహనరంగా జయంతిని నిర్వహించారు. చింతపల్లి చిన్నా ఆధ్వర్యంలో పలువురు రంగా విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ నల్లా విష్ణుమూర్తి, నల్లా పవన్‌కుమార్, అబ్బిరెడ్డి సురేష్, సుందరనీడి నాయుడు, పోలిశెట్టి వీరబాబు, తిరుమనాథం జాంబ, మోటుపల్లి బాలు తదితరులు పాల్గొన్నారు. నల్లవంతెన దిగువున ఉన్న రంగా విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు నల్లా అజయ్, నల్లా సంజయ్, వంటెద్దు బాబి, కుడుపూడి శ్రీను, యార్లగడ్డ రవీంద్ర, జక్కంపూడి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



గడియారస్తంభం సెంటర్‌లో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనంచేసిన నాయకులు

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం

అమలాపురంటౌన్, జూలై 4: పార్లమెంటు సమావేశాల్లో హిందువులపై రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో గురువారం గడియార స్తంభం సెంటర్లో ప్రదర్శన నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కొండేటి ఈశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా చేసిన వ్యాఖ్యలకు రాహుల్‌గాంధీ తక్షణం క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు ఆర్వీ నాయుడు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, నాయకులు గనిశెట్టి వెంకటేశ్వరరావు, కాలాబత్తుల చిన్నారి, దూరి రాజేష్, రేకాడి సత్యనారాయణవర్మ, కాశిన ఫణీంద్ర, గనిశెట్టి అరవింద్, బొంతు శివాజీ, జగతా శాంతి, వెంపరాల భాస్కరశాస్త్రి, వంశీ పాల్గొన్నారు.

● విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో గడియార స్తంభం సెంటర్లో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. కార్యకర్తలకు స్వల్ప గాయాలయ్యాయి. భజరంగ్‌దళ్ రాష్ట్ర సహ ప్రముఖ్ శిరంగు నాయుడు, పుత్సా కృష్ణకామేశ్వర్, గోటేటి గంగాధరరావు, కర్రి పార్థసారధి, ఊటుకూరి సాంబయ్య, పిచ్చిక సుబ్రహ్మణ్యం, కురసాల వీరబాబు, యక్కల బ్రహ్మేష్, వేదనభట్ల సాయిలక్ష్మి, మేడిశెట్టి తాతాజీ, గోళ్ల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ వ్యాఖ్యలపై వీహెచ్‌పీ, బీజేపీ నిరసన

రామచంద్రపురం(ద్రాక్షారామ): పార్లమెంటులో రాహుల్ గాంధీ హిందువులపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా విశ్వహిందూ పరిషత్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు గురువారం రాజగోపాల్ సెంటర్‌లో ఆందోళన చేశారు. రాహుల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాహుల్ చిత్రపటాన్ని చెప్పులతో కొట్టారు. కార్యక్రమంలో హిందూ పరిరక్షణ సమితినాయకుడు చెరుకుపల్లి గణేష్‌శర్మ, జిల్లా అధ్యక్షుడు రుద్రశర్మ, తోలేటి గంగాధర, తోటరామకృష్ణ, పట్టణ బీజేపీ అధ్యక్షుడు కేశవ రాఘవేంద్రరావు, కొట్టువాడ హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: రాహుల్‌గాంధీ హిందువులకు క్షమాపణ చెప్పాలంటూ మలికిపురం సెంటర్‌లో బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితో పాటు ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో కూడా పెట్టాలని ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో అడబాల రాంబాబు, దొడ్డా నాగబాబు, మాలే శ్రీనివాసనగేష్, అడబాల సత్యనారాయణ, ఇందుకూరి అచ్యుతరామరాజు, చెంపాటి శివరామకృష్ణంరాజు, మేడిచర్ల చాణుక్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నిరంకుశ పాలనకు నిరసన




అమలాపురంలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

అమలాపురం టౌన్, జూలై 4: బీజేపీ నిరంకుశ పాలనను నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు అమలాపురం గడియార స్తంభం సెంటర్లో గురువారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. పార్లమెంటులో ప్రతిపక్ష నాయకునిగా రాహుల్‌గాంధీ అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేని స్థితిలో ప్రధాని మోదీ ఉన్నారని జిల్లాశాఖ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు ఆరోపించారు. మత సామరస్యం గురించి, హిందూ ధర్మం గురించి, దేశ ప్రజల కోసం మాట్లాడిన రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మలను దహనం చేయడం వెనుక బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకుల ప్రోత్సాహం ఉందని ఆరోపించారు. బీజేపీ తీరుకు నిరసనగా కాంగ్రెస్ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో నిరసన ర్యాలీ నిర్వహించారు. నాయకులు కొత్తూరి శ్రీనివాస్, వడ్డినాగేశ్వరరావు, అయితాబత్తుల సుభాషిణి, యార్లగడ్డ రవీంద్ర, నీతిపూడి బాలసత్యనారాయణ, ముషిణి రామకృష్ణ, కుడుపూడి శ్రీనివాస్, వంటెద్దు బాబి, షకీలా, సరెళ్ల ప్రసన్నకుమార్, కోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వారాహీ నవరాత్రి పూజా మహోత్సవాలు ప్రారంభం

అమలాపురంటౌన్, జూలై 4: శ్రీగౌతమ మహర్షి అక్షయపాత్ర ఆధ్వర్యంలో వారాహీ నవరాత్రి పూజా మహోత్సవాలు గురువారం రాత్రి ప్రారంభమయ్యాయి. విద్యుత్ నగర్‌లోని ఆదిశేషా నిలయంలో తూము మాణిక్యాలరావు (దొరబాబు)-రూపావతి, తూము భీమేశ్వరరావు (చిట్టిబాబు)-నాగమణి దంపతులు సర్వతోభద్ర వేదికపై కలశాది దేవతలను ప్రతిష్ఠించారు. తొలుత మహిళలు కలశలతో పీఠ ప్రాంగణానికి చేరుకున్నారు. మానవ శరీరంలో 33 మార్మిక స్థానాల్లో 33 దేవతా శక్తులు కొలువై ఉన్న రీతిలోనే దేవతల ఆవాహన చేసినట్టు నిర్వాహకుడు పి.రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో చాగంటి ప్రసాద్, నాగకనకదుర్గ (నందు), మాకిరెడ్డి వీఎస్ఎస్ పూర్ణిమ పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన యానాం ఎమ్మెల్యే



సీఎం చంద్రబాబును సత్కరిస్తున్న ఎమ్మెల్యే గొల్లపల్లి

యానాం, జూలై 4: ఢిల్లీ పర్యటనలో భాగంగా యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ము ఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని కలిశారు. ఎంపీ భరత్, రామ్మోహన్ నాయుడు సమక్షంలో ఢిల్లీలో కలిశారు. సీఎం చంద్రబాబును శాలువాతో సత్కరించారు. యానాంకు చెందిన పలు పెండింగ్ అంశాలను బాబు దృష్టికి తీసుకెళ్లినట్లు యానాం ఎమ్మెల్యే తెలిపారు.

శిక్షణా కేంద్రం పరిశీలన

మలికిపురం, జూలై 4: నాబార్డు వారి సహకారంతో ఆక్సిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీవనోపాధి ఆధారిత శిక్షణా కార్యక్రమాన్ని నాబార్డు జీడీఎం సోమునాయుడు పరిశీలించారు. శిక్షణ జరుగుతున్న విధివిధానాలపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్నవారికి నూతనంగా యూనిట్లు పెట్టుకోవడానికి ప్రభుత్వ సహకారం అందిస్తామని తెలిపారు. జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ కేశవవర్మ, ఆక్సిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు కటికిరెడ్డి గంగాధర్, తోట ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం

అమలాపురం టౌన్, జూలై 4: కేంద్ర ప్రభుత్వ విద్యార్థి వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నీట్ పరీక్షల నిర్వహణలో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండు చేస్తూ అఖిల పక్ష విద్యార్థి సంఘాల ఐక్య వేదిక పిలుపు మేరకు చేపట్టిన విద్యా సంస్థల బంద్ జిల్లాలో పూర్తిగా విజయవంతమైంది. పీడీఎస్‌యూ నాయకులు రేవు తిరుపతిరావు, ఎస్.రమేష్, పి.మోహన్ తదితరులు పాల్గొన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అమలాపురం పట్టణం, పరిసర గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు పూర్తిస్థాయిలో బంద్ పాటించాయి. పలుచోట్ల విద్యార్థులు తరగతులు బహిష్కరించారు. కార్యక్రమంలో ఎస్ఐఎఫ్ నాయకులు కె.ప్రణీత్, కె.శంకర్ పాల్గొన్నారు.

రామచంద్రపురం/ద్రాక్షారామ: నీట్ పరీక్షను రద్దు చేయాలని విద్యార్థి సంఘాలు ఇచ్చిన దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్ పిలుపుమేరకు గురువారం రామచంద్రపురం పట్టణంలో విద్యాసంస్థలు బంద్ పాటించారు. కార్పొరేట్, ప్రైవేటు, ప్రభుత్వ విద్యాసంస్థలు బంద్ చేయించారు. కార్యక్రమంలో పి.వై.ఎల్.నాయకులు వి.భీమశంకరం, ఐ.ఎఫ్.టీ.యూ నాయకులు చింతా రాజారెడ్డి, పి.డి.ఎస్.యు. నాయకులు ప్రశాంత్, కరుణాకర్, హరీష్, యశ్వంత్, వీరబాబు, సత్యసాయి, గౌతమ్ పాల్గొన్నారు.

కె.గంగవరం: మండలంలోని ప్రభుత్వం పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలలు మూసివేసి బంద్ పాటించారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా నాయకుడు ప్రశాంత్ కరుణాకర్, పీడీఎస్ యూ నాయకులు హరీష్, యశ్వంత్, వీరబాబు, సత్యసాయి, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: నీట్ పరీక్ష పత్రాలను లీక్‌చేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిన దోషులను శిక్షించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. గురువారం మండల పరిధిలోని విద్యా సంస్థలన్నీ బంద్ చేశారు.

మండపేట: నీట్‌పరీక్షను రద్దుచేయాలని దేశవ్యాప్తంగా విద్యా సంస్థల బంద్ గురువారం మండపేటలో విజయవంతంగా జరి గింది. ఈ కార్యక్రమంలో పైఎల్.జిల్లా నాయకులు వీ, బీమశంకరం, ఏఐఎస్ఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, వెంకట్, ఐఎఫ్‌టీయూ నాయకులు చింతారాజారెడ్డి, పాల్గొన్నారు.

అక్విడెక్టుల నిర్వహణను పూర్తిగా విస్మరించారు

● ఇరిగేషన్ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం

పి.గన్నవరం, జూలై 4: 'పి.గన్నవరం కొత్త, పాత అక్విడెక్టుల నిర్వహణను పూర్తిగా విస్మరించారు.... కొత్త అక్విడెక్టుపై ఆ గోతులేంటీ, పాత అక్విడెక్టు ఈ మొక్కలేంటీ' అంటూ ఇరిగేషన్ డీఈ వెంకటేశ్వరరావుపై పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మండిపడ్డారు. గోతులు పూడ్చడానికి ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. మాకు పనిచేసే వాళ్లు మాత్రమే కావాలని స్పష్టం చేశారు. గురువారం ఆయన స్థానిక నాయకులతో కలిసి రెండు అక్విడెక్టులను పూర్తిస్థాయిల్లో పరిశీలించిపై విధంగా స్పందించారు. గోతుల్లో ఊచలు బయటపడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త అక్విడెక్టుపై వర్షపునీరు వెళ్లే రంధ్రాలవద్ద పేరుకు పోయిన మట్టిని, పాత అక్విడెక్టుపై రావిచెట్లను తొలగించే ఏర్పాటుచేయాలని సూచించారు. అక్విడెక్టుల నిర్వహణపై ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపించాలని డీఈకి సూచించారు. పాత అక్విడెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే అంశాన్ని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేశ్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్‌లు బొండాడ నాగమణి, పసలపూడి రామకృష్ణ, సంసాని పెద్దిరాజు, శిరిగినీడి వెంకటేశ్వరావు, వాసంశెట్టి కుమార్, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, తోలేటి సత్తిబాబు, కత్తుల శ్రీను, యడ్ల ఏసు, శేరు శ్రీనుబాబు, తాటికాయల శ్రీనివాసరావు, బాబూరావు ఉన్నారు.



పిగన్నవరం అక్విడెక్టుపై గోతుల్లో బయటకు వచ్చిన ఊచలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

అన్నదాన భవన నిర్మాణానికి రూ.50వేలు విరాళం

ఆత్రేయపురం, జూలై 4: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి గుంటూరుకు చెందిన బొమ్మిడాల వెంకట శ్రీకోటిరత్నం-సత్యకళ్యాణి దంపతులు రూ.50,116 విరాళం సమర్పించారు. వారికి ఉప కమిషనరు కిషోర్‌కుమార్ స్వామివారి చిత్రపటం అందించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి

కొత్తపేట, జూలై 4: విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 సంవత్సరానికి సంబంధించి బీఏ ఎకనమిక్స్, బీఏ పొలిటికల్ సైన్సు, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ మేథమెటిక్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ కంప్యూటర్ సైన్సు, బీజెడ్‌సీ జువాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు తెలిపారు. తమ కళాశాలలో మౌలిక వసతులతో పాటు అనుభవజ్ఞులైన అధ్యాపకులు అందుబాటులో ఉన్నారన్నారు. అతి తక్కువ ఫీజు, స్కాలర్‌షిప్ సదుపాయాలు కల్పిస్తామన్నారు. చేరగోరే విద్యార్థులకు కళాశాలలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తామని చెప్పారు.

అక్రమ నిర్మాణం తొలగింపు

ఉప్పలగుప్తం, జూలై 4: అల్లవరం మండలంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న ఉప్పలగుప్తం గ్రామానికి చెందిన చిక్కం శ్రీనివాసరావు ఉప్పలగుప్తం పంచాయతీ స్థలంలో రాత్రికిరాత్రి రేకుల షెడ్డు నిర్మించాడు. దానిని గురువారం కూల్చివేశామని పంచాయతీ కార్యదర్శి తిక్కిరెడ్డి రామకృష్ణ తెలిపారు.

ఘనంగా బుల్లిబాపనమ్మ తీర్థం

రాయవరం, జూలై 4: మండలంలోని సోమేశ్వరం గ్రామస్థుల ఇలవేల్పు శ్రీబుల్లి బాపనమ్మ అమ్మవారి తీర్థం గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది ఆషాడమాసం ముందు వచ్చే అమావాస్యరోజున తీర్థం నిర్వహించడం ఆనవాయితీ. తీర్థం పురస్కరించుకుని అమ్మవార్ని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు దర్శించుకున్నారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ అమలాపురం పార్లమెంట్ ఉపాధ్యక్షుడు వైఆర్కే పరమహంస, రావుల సత్యనారాయణ, శాకా బాల భాస్కర్, కడియాల వెంకటరమణ, శాకా కోటేశ్వరరావు, గరగ శ్రీరామకృష్ణ, అంబవరపు సత్యనారాయణ, శాకా శ్రీనివాస్, జాడా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'కళాశాల సమస్యలను పరిష్కరించండి'

రాయవరం, జూలై 4: రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు గురువారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును మండపేటలో మర్యాదపూర్వకంగా కలిశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రామారావు ఆధ్వర్యంలో సిబ్బంది ఎమ్మెల్యేను దుశ్శాలువాతో సత్కరించి మొక్కను అందజేశారు. ఎమ్మెల్యే కళాశాలలో సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. అధ్యాపకులు నాగేశ్వరరెడ్డి, రమేష్, సుధాకరవర్మ ఎమ్మెల్యేను కలిసినవారిలో ఉన్నారు.

అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించాలి

మండపేట, జూలై 4: పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి కాంట్రాక్టర్లను కోరారు. ఈమేరకు ఆమె కాంట్రాక్టర్లతో సమీక్షను నిర్వహించారు.

బంగారు ఆభరణాల చోరీపై ఫిర్యాదు

ముమ్మిడివరం, జూలై 4: ఇంట్లో బీరువాలో భద్రపరుచుకున్న బంగారపు ఆభరణాలను తమ సమీప బంధువు దొంగిలించుకుపోయిందని ఒక మహిళ ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ముమ్మిడివరం బాలయోగి కాల్వగట్టు రోడ్డులో నివాసం ఉంటున్న జిత్తుక సుజని ఇంటికి రాజోలు మండలం పొన్నమండ గ్రామానికి చెందిన బంధువు సరెళ్ల తేజస్విని తరచూ వస్తూ ఉండేదని, ఈ నేపథ్యంలో మే 16న తమ ఇంటికి వచ్చిన తేజస్విని బీరువాలోని సుమారు రూ.2లక్షల 15వేల విలువగల బంగారు ఆభరణాలను దొంగలించుకుపోయిందని ఆమె వెళ్లాక బీరువా తెరిచి ఉండడాన్ని గమనించి వస్తువుల కోసం చూసుకోగా అవి లేకపోవడంతో బంధువుల సమక్షంలో తగువుపెట్టినా ఆ బంగారు వస్తువులు తిరిగి ఇవ్వలేదని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ముమ్మిడివరం ఎస్ఐ డి.సురేష్‌బాబు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

బాలబాలాజీ ఆలయాన్ని అభివృద్ధి చేస్తా

● ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

మామిడికుదురు, జూలై 4: అప్పనపల్లి బాలబాలాజీ ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. దేవస్థానాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తానన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం మొదటిసారిగా బుధవారం రాత్రి ఆయన బాలబాలాజీ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి వేదాశీర్వచనం ఇచ్చారు. కూటమి నాయకులు, ఆలయ ఉద్యోగులు ఎమ్మెల్యేను దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, ఆలయ సహాయ కమిషనరు జి.మాధవి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని పరిశీలించిన నాబార్డు బృందం

మామిడికుదురు, జూలై 4: క్షేత్రస్థాయిలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను నాబార్డు బృందం గురువారం పరిశీలించింది. పాశర్లపూడిలో కొబ్బరి పీచు దుకాణాన్ని పరిశీలించి బొమ్మల తయారీని మెచ్చుకున్నారు. పాశర్లపూడి బాడవలో వంతెనపై నిర్మించిన కల్వర్టును పరిశీలించారు. ఏజీఎం సోమునాయుడు, ఆక్సిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు కటికిరెడ్డి గంగాధర్, ట్రైనర్ తోట ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

'రాజ్యాంగ హక్కులను తక్షణమే పునరుద్ధరించాలి'

రాజోలు, జూలై 4: ఎస్సీ, ఎస్టీ వర్గాలకు వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైపోయిన రాజ్యాంగ హక్కులను, రాయితీలను, నిధులను తక్షణం పునరుద్ధరించాలని రాజోలు తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు దళిత చైతన్యవేదిక నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. బత్తుల జనార్ధనరావు, చిలకపాటి శ్రీధర్, జిల్లెల్ల వినోద్, దీపాటి శివప్రసాద్, తెన్నేటి నాగేశ్వరరావు, బొడ్డపల్లి పుల్లయ్య, బుడితి గోపాలకృష్ణ, కాకర విశ్వనాథం పాల్గొన్నారు.